ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



కాకినాడ
జిల్లా వార్తలు
ఆదివారం 3 మార్చి 2024 | 5

సత్యదేవుడికి బంగారు, వెండి వస్తువుల అందజేత - 7లో

తిరుపతి ఆలయానికి పోటెత్తిన భక్తులు - 8లో

ఘనంగా భీమశంకరస్వామి కల్యాణం



బలంగా.. 'ఢీ' కొట్టాల్సిందే



- జిల్లాలో మిగిలిన అసెంబ్లీ స్థానాల అభ్యర్థులపై టీడీపీ ఎడతెగని కసరత్తు
- ప్రకటించాల్సిన సీట్లలో గెలుపుగుర్రాల ఎంపికపై కొనసాగుతున్న వడపోత
- కాకినాడ సిటీ స్థానం పరిశీలనలో పలువురి పేర్లు
- ద్వారంపూడిని ఢీకొట్టే ధీటైన అభ్యర్థి ఎంపికకోసం సుదీర్ఘ కసరత్తు
- తొలుత పవన్ అనుకున్నా పిఠాపురం ఖాయమవడంతో మల్లగుల్లాలు
- ఆర్థిక బలమున్న అభ్యర్థి అయితేనే సిటీలో ఢీకొట్టగలమని పార్టీ ఆలోచన
- పిఠాపురం నుంచి పవన్ నిలబడితే వర్మను ఏం చేయాలని ఆలోచన
- పవన్ పోటీ చేయకపోతే వర్మకే సీటు.. అటు ప్రత్తిపాడు సీటు సత్యప్రభకే

జిల్లాలో ఎన్నికల హడావుడి నడుస్తోంది. ఇంకా ప్రకటించని అసెంబ్లీ నియోజకవర్గాల అభ్యర్థుల ఎంపికపై టీడీపీ మరింత వేగంగా కసరత్తు చేస్తోంది. ఇటీవల తుని, జగ్గంపేట, పెద్దాపురం సీట్లు ప్రకటించగా పొత్తులో భాగంగా జనసేన కాకినాడ రూరల్ అభ్యర్థిని ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఇంకా మిగిలి ఉన్న సీట్లలో గెలుపు గుర్రాల ఎంపికపై కూలంకషంగా వడపోత పోస్తోంది.

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

జిల్లాలో కాకినాడ సిటీ, పిఠాపురం, ప్రత్తిపాడు సీట్లకు సంబంధించి టీడీపీ అభ్యర్థులను ప్రకటించాల్సి ఉండగా, ఇందులో పిఠాపురం నుంచి పవన్‌కళ్యాణ్ దిగడం దాదాపు ఖాయంగా కనిపిస్తోంది. దీంతో కాకినాడ సిటీ, ప్రత్తిపాడు సీట్లలోనే అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది. కాకినాడ సిటీలో వైసీపీ ఎమ్మెల్యే ద్వారంపూడిని ఢీకొట్టే బలమైన నేత విషయంలో పార్టీ సుదీర్ఘ కసరత్తు జరుపుతోంది. తొలుత ఇక్కడి నుంచి పవన్ పోటీ చేస్తారని ప్రచారం జరిగినా పిఠాపురం ఖాయం కావడంతో ద్వారంపూడిపై పోటీ చేసే నేతను ఎంపిక చేసే విషయమై ఆచితూచి అగుడులు వేస్తోంది. ధన బలం, కండబలం పుష్కలంగా ఉన్న ద్వారంపూడిపై పోటీ చేసే అభ్యర్థి కూడా అదేస్థాయిలో ఉంటేనే అనుకున్న ఫలితం రాబట్టవచ్చని ఆలోచిస్తోంది. మాజీ ఎమ్మెల్యే కొండ బాబు, గుణ్ణం చంద్రమౌళి, సుస్మిత, పావని తదితర పేర్లపై ఐవీఆర్ఎస్‌తోపాటు సర్వే నివేదికలు రప్పించుకుని పరిశీలిస్తోంది. పిఠాపురంనుంచి పవన్ పోటీ చేస్తే మాజీ ఎమ్మెల్యే వర్మను ఎలా గౌరవించాలనే దానిపైనా బేరీజు వేస్తోంది. ప్రత్తిపాడు సీటు వరుపుల సత్యప్రభకే ఖాయమైనా జనసేన అడుగుతుండడంతో తాత్కాలికంగా ప్రకటన వాయిదా వేసింది.

ఆచితూచి.. బేరీజు వేసి..

అసెంబ్లీ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా టీడీపీ పావులు కదుపుతోంది. ఎక్కడికక్కడ నియోజకవర్గాల్లో గెలుపు గుర్రాలను దించడానికి భారీ కసరత్తు చేస్తోంది. నియోజకవర్గంలో బలమైన అభ్యర్థులు, ఆర్థికంగా వైసీపీని ఢీకొట్టే సామర్థ్యం, సామాజిక సమీకరణాలు తదితర అన్ని కోణాల్లో లెక్కలు వేసి ఎంపిక చేస్తోంది. ఇందులోభాగంగా ఇటీవల పెద్దాపురం, జగ్గంపేట, తునిస్థానాల్లో చినరాజప్ప, జ్యోతుల నెహ్రూ, యనమల దివ్య పేర్లు ప్రకటించింది. జనసేననుంచి కాకినాడ రూరల్ సీటుకు పంతం నానాజీ పేరును ఖాయం చేసింది. దీంతో ఇంకా కాకినాడ సిటీ, పిఠాపురం, ప్రత్తిపాడు స్థానాల్లో అభ్యర్థులను వెల్లడించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో వీటికి సంబంధించి టీడీపీ అధిష్ఠానం భారీ కసరత్తు చేస్తోంది. పొత్తులో భాగంగా పిఠాపురం సీటు నుంచి జనసేన తరఫున పవన్‌కళ్యాణ్ బరిలోకి దిగడం దాదాపు ఖాయంగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో ఇక్కడ బలమైన నేతగా ఉన్న పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మను ఏం చేయాలనే దానిపై టీడీపీ మల్లగుల్లాలు పడుతోంది. పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్సీ ఇచ్చే అంశంపై పరిశీలిస్తోంది. ఒకవేళ పవన్ పోటీ చేయకపోతే వర్మ టీడీపీ అభ్యర్థిగా కొనసాగనున్నారు. ఒకవేళ పవన్ కాకినాడ ఎంపీగా బరిలోకి దిగుతారని కూడా బలంగా ప్రచారం జరుగుతోంది. అదే జరిగితే పిఠాపురం సీటు వర్మకే కొనసాగనుంది.

ద్వారంపూడిని ఓడించాలని..

కాకినాడ సిటీ నియోజకవర్గం విషయంలో టీడీపీ సుదీర్ఘ కసరత్తు చేస్తోంది. ఇక్కడ వైసీపీ ఎమ్మెల్యే ద్వారంపూడి ఆర్థికంగా అత్యంత బలంగా ఉన్నారు. ఈయన్ను ఎట్టిపరిస్థితుల్లో ఓడించి తీరుతానని పవన్‌కళ్యాణ్ ఇప్పటికే ప్రకటించారు. మరోపక్క ద్వారంపూడి ఈ ఐదేళ్లలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని చెలరేగిపోయారు. రామేశంమెట్ట నుంచి రియల్ ఎస్టేట్, వ్యాపారులపై వేధింపులు, అధికారుల సొంత పనులు చక్కబెట్టుకోవడం ఒక టేంటి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు మినీ సీఎంగా వ్యవహరించారని టీడీపీ, జనసేనలు ఇప్పటికే ధ్వజమెత్తుతున్నాయి. పైగా ద్వారంపూడి సైతం ముఖ్యనేత అండతో టీడీపీ అధినేత చంద్రబాబు, లోకేశ్, జనసేన అధినేత పవన్‌ను గతంలో దారుణంగా బూతులు తిట్టారు. ఈ నేపథ్యంలో ఇలాంటి వ్యక్తి అసెంబ్లీలోకి అడుగు పెట్టకుండా చూడాలని టీడీపీ, జనసేనలు భావిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఇక్కడ టీడీపీ తరఫున మాజీ ఎమ్మెల్యే కొండబాబును బరిలోకి దించాలని భావిస్తున్నా ఆయన ద్వారా ద్వారంపూడిని ఢీకొట్టడం అంత తేలిక కాదని పార్టీ భావిస్తోంది. ఈ నేపథ్యంలో ఆయన సోదరుడి కోడలు సుస్మిత, పెద్దాపురం నియోజకవర్గ టీడీపీ సీనియర్ నేత గుణ్ణం చంద్రమౌళి, మాజీ మేయర్ పావని పేర్లను పరిశీలిస్తోంది. వీరికి సంబంధించి ఐవీఆర్ఎస్ సర్వేలు, ఇతర నివేదికలు రప్పించుకుంది. వీరిలో మౌళి ఆర్థికంగా, స్థానిక బలం పరంగా ధీటుగా ఉంటారని భావిస్తోంది. ఈ సీటు మత్స్యకార సామాజికవర్గానికే ఇవ్వాల్సి ఉండడంతో ఏం చేయాలనే దానిపై రకరకాలుగా బేరీజు వేస్తోంది. అటు ఆర్థికంగాను ఢోకా ఉండదనే లెక్కలు వేస్తోంది. అటు మత్స్యకారులకు కచ్చితంగా సీటు ఇవ్వాల్సి ఉండడంతో కొండ బాబును కాదనలేని పరిస్థితి. అటు ఇదే సామాజికవర్గం నుంచి మహిళను నిలబెడితే క్యాడర్ పరంగా మద్దతు కష్టమవుతుందనే భావనతో ఏం చేయాలనే దానిపై మల్లగుల్లాలు పడుతోంది.

వైసీపీ వ్యూహాలు

మరోపక్క ప్రజా వ్యతిరేకత కారణంగా ఓటమి భయంతో ద్వారంపూడి స్థానంలో ఆయన భార్య, లేదా కాపు సామాజికవర్గం నుంచి వేరొకరిని బరిలో నిలబెట్టించాలని వైసీపీ భావిస్తోంది. ఎన్నికల వ్యూహంతో నియోజకవర్గంలో మత్స్యకారుల ఓట్లకు గేలం వేయడానికి గతేడాది వాడబలిజ సామాజికవర్గానికి చెందిన మహిళకు ఎమ్మెల్సీ ఇచ్చి ఓట్లపై గురిపెట్టింది. ఈ నేపథ్యంలో వైసీపీ వ్యూహాలను గమనిస్తూ ఆ పార్టీ అభ్యర్థిని ప్రకటించిన తర్వాత టీడీపీ లెక్కలు వేస్తున్న అభ్యర్థుల్లో ఎవరిని నిలబెట్టాలి అనేదానిపైనా నిర్ణయం తీసుకోవాలని భావిస్తోంది.

పవన్ స్థానాన్ని బట్టి..

వాస్తవానికి పవన్ తొలుత కాకినాడ సిటీ నుంచి బరిలోకి దిగుతారని ప్రచారం జరిగింది. తద్వారా ద్వారంపూడి ఓటమి ఖాయమనే అంచనాలు నెలకొన్నాయి. కానీ పిఠాపురంనుంచి నిలబడతారనే తాజా అంచనాల నేపథ్యంలో కాకినాడ సిటీలో ద్వారంపూడిని ఢీకొట్టే సమర్థ నేత ఎవరనేదానిపై ఇప్పుడు మళ్లీ వెతకాల్సిన పరిస్థితి నెలకొంది. పవన్ కాకినాడ సిటీనుంచి నిలబడితే, అటు టీడీపీకి పిఠాపురం సీటు ఇబ్బంది ఉండదని, అప్పుడు అక్కడా, ఇక్కడా రెండుచోట్లా టీడీపీ కూటమి విజయం సాధించే అవకాశం ఉంటుందనే విశ్లేషణలు పార్టీవర్గాల్లో వ్యక్తమవుతున్నాయి. టీడీపీ అధిష్ఠానం అడుగులు ఎటుంటా యనేది ఆసక్తికరంగా మారింది. ప్రత్తిపాడునుంచి వరుపుల సత్యప్రభకే సీటు ఖాయంగా కనిపిస్తోంది. జనసేన ఈ సీటు కూడా కోరుతోంది. ఇప్పటికే కాకినాడరూరల్ సీటు ఆ పార్టీకి ఇచ్చారు. పిఠాపురం, కాకినాడ ఎంపీ సీటు కూడా జనసేనకు వెళ్తే ప్రత్తిపాడు టీడీపీకే ఉండిపోనుంది. ఈ చిక్కుముళ్లు తేలడానికి మరింత సమయం పట్టే అవకాశం ఉంది.

జిల్లావ్యాప్తంగా.. నేడు పల్స్‌పోలియో

జీజీహెచ్(కాకినాడ), మార్చి 2: జిల్లావ్యాప్తంగా పల్స్‌పోలియో కార్యక్రమాన్ని ఆదివారం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్నారు. జిల్లావ్యాప్తంగా 1.94లక్షలమంది చిన్నారులు లక్ష్యంగా 1350 బూత్‌ల్లో వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఉదయం 7గంటలనుంచి సాయంత్రం 5 గంటల వరకు పల్స్‌పోలియో కార్యక్రమం జరగనుంది. ఈ కార్యక్రమాన్ని కాకినాడ రామారావుపేటలోని యూపీహెచ్‌సీ నుంచి మున్సిపల్ కమిషనర్ వెంకట్రావు ప్రారంభించనున్నారు. అనివార్య కారణాలవల్ల వ్యాక్సినేషన్‌కు అందుబాటులోకి రాని మిగిలిపోయిన పిల్లల కోసం సోమ, మంగళవారంలో ఏఎన్ఎంలు, అంగన్‌వాడీలు, ఆశావర్కర్లు, వలంటీర్లతో కలిసి గృహాలను సందర్శించి పోలియో వ్యాక్సిన్‌ను వేయనున్నారు. జిల్లా వైద్యఆరోగ్య శాఖాధికారి డాక్టర్ నరసింహనాయక్ ఆధ్వర్యంలో, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ కె.రత్నకుమార్ పర్యవేక్షణలో ఈకార్యక్రమం జరగనునంది. కలెక్టర్ కృతికాశుక్లా ఈ కార్యక్రమాన్ని నేరుగా పర్యవేక్షించనున్నారు.

ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్షలకు 16,662 మంది విద్యార్థుల హాజరు

కాకినాడ రూరల్, మార్చి 2: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర విద్యార్థుల పరీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. సంస్కృతం-2, తెలుగు-2, హిందీ-2, ఒకేషనల్ జీఎఫ్‌సీ పరీక్షలను ఉదయం 9నుంచి 12 గంటలవరకూ నిర్వహించినట్లు డీఐఈవో నూకరాజు తెలిపారు. జనరల్ విద్యార్థులు 17,015మంది హాజరుకావాల్సి ఉండగా 16,662మంది హాజరుకాగా 355మంది పరీక్ష రాయలేదన్నారు. ఒకేషనల్ విద్యార్థులు 1253మంది హాజరుకావాల్సిఉండగా 1202మంది హాజరు కాగా 51మంది గైర్హాజరయ్యారని తెలిపారు.ముగ్గురు ఫ్లయింగ్, ఇద్దరు సిట్టింగ్ స్క్వాడ్లు24కళాశాలల్లోని కేంద్రాలను తనిఖీ చేశారన్నారు.

టీడీపీ సభకు ముమ్మరంగా ఏర్పాట్లు

ప్రత్తిపాడు, మార్చి 2: టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు రా.. కదలిరా సభ ఈనెల 9న ప్రత్తిపాడులో నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి శనివారం నుంచే విస్తృత ఏర్పాట్లు చేపట్టారు. సభ ఏర్పాటుకు అవసరమైన స్థల పరిశీలనను ప్రత్తిపాడు, ధర్మవరం, రాచపల్లి, యర్రవరం గ్రామాల్లో ఆరు చోట్ల జరిపారు. ప్రత్తిపాడు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సత్యప్రభ ఆధ్వర్యంలో పార్టీనాయకులు స్థల పరిశీలన నిర్వహించారు. చంద్రబాబు సమావేశాలు, పార్టీ కార్యక్రమాలు చూసే రాబిన్ శర్మ బృందం కూడా స్థల పరిశీలన నిర్వహించింది. ఆరు చోట్ల స్థల పరిశీలన చేసినా చంద్రబాబు సమావేశం నిర్వహించే ప్రదేశాన్ని ఇంకా ఖరారు చేయలేదు. ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గానికి చెందిన 10వేల మంది కార్యకర్తలు పాల్గొనేలా చంద్రబాబు సమావేశం ఉంటుందని టీడీపీ నాయకులు తెలిపారు. రాబోయే ఎన్నికల్లో పార్టీ యంత్రాంగం అనుసరించాల్సిన చర్యలపై చంద్రబాబు దిశానిర్దేశం చేస్తారని వారు తెలిపారు.

ఇంటివద్దకే విద్య కార్యక్రమం సద్వినియోగం చేసుకోవాలి



ఇంటి వద్దకే విద్య అమలు తీరును పరిశీలిస్తున్న సీఎంవో

- జిల్లా సహిత విద్య సమన్వయకర్త నాగేశ్వరరావు

సామర్లకోట, మార్చి 2: పాఠశాలలకు వెళ్లలేని చిన్నారులను ప్రభుత్వం ప్రత్యేకంగా గుర్తించి ఇంటివద్దకే విద్య కార్యక్రమం ఐఈఆర్‌టీ ద్వారా అమలు చేస్తున్నందున సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సహిత విద్య సమన్వయకర్త, సీఎంవో చామంతి నాగేశ్వరరావు అన్నారు. సామర్లకోట మండలంలో ఎంఈవో పి.పుల్లయ్య ఆధ్వర్యంలో అమలు చేస్తున్న ఇంటివద్దకే విద్య కార్యక్రమం తీరును పరిశీలించేందుకు సీఎంవో చామంతి శనివారం ఆకస్మిక పర్యటన చేశారు. విద్యార్థినుల ఇళ్లకు వెళ్లి ఇంటివద్ద నేర్పించే విద్యాంశాలను తెలుసుకున్నారు. టీఎల్ఎంను వినియోగించి ఎలా విద్య అందిస్తున్నారో తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రిజిస్టర్లను సీఎంవో పరిశీలించారు. ఇంటివద్ద విద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు కూడా విద్యా కానుక, అమ్మఒడి లాంటి ప్రభుత్వ పథకాలు అందుతున్నదీ, లేనిదీ అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో భవిత సిబ్బంది కూడా పాల్గొన్నారు.

దిశ మారిన ఏలేరు జలాలు

- సామర్లకోటలో పీబీసీ నుంచి గోదావరి కాలువకు రివర్స్

సామర్లకోట, మార్చి 2: సామర్లకోట పట్టణ ప్రజల దాహార్తి తీర్చే సామర్లకోట మున్సిపల్ ఫిల్టర్ వాటర్ స్కీంకు సంబంధించి వేసవి జలాశయంలో ఏలేరు జలాలు మళ్లడంతో తాగునీరుగా పూర్తిస్థాయిలో శుద్ధి అయ్యేనా అంటూ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పదిరోజులుగా సామర్లకోట గోదావరి కాలువలో నీటి విడుదల పూర్తిగా తగ్గిపోవడంతో సామర్లకోటనుంచి పీబీసీ కెనాల్‌కు వెళ్లే కాలువ వెంబడి పొలాలకు నీటి తడులను అందించేందుకు ఏలేరు జలాలను మళ్లించారు. దీంతో సామర్లకోట లాకుల నుంచి గోదావరి జలాలు రావువారి చంద్రంపాలెం మీదుగా పిఠాపురం, యు.కొత్తపల్లి, తొండంగి మండలాలకు చెందిన పొలాలకు నీటి తడులు అందిస్తున్నారు. దీంతో ఏలేరు జలాలు పీబీసీ కెనాల్ మీదుగా తిరిగి సామర్లకోట లాకుల వద్దకు చేరి లాకులనుంచి వీకే రాయపురం వెళ్లే కాలువలోకి ప్రవహిస్తున్నాయి. అదే సమయంలో లాకులనుంచి సామర్లకోట వేసవి జలాశయానికి కూడా ఏలేరు జలాలు చేరుతున్నాయి. కాగా ఏలేరు జలాలు గోదావరి కాలువ జలాల కంటే బురదగా ఉండడం, ఏలేరు జలాలు పెద్దాపురం ఎగువ ప్రాంతాల పరిశ్రమలనుంచి వ్యర్థ కాలుష్య జలాలు కలుషితం కావడంవల్ల ప్రజలకు తాగునీటి సమస్యలు ఉత్పన్నమయ్యే ప్రమాదం ఉందని పలువురు ఆందోళన చెందుతున్నారు. వేసవికాలం ఇప్పుడిప్పుడే ప్రారంభమవుతున్న తరుణంలోనే పట్టణ ప్రజలకు తాగునీటి ఎద్దడి మొదలవ్వడంతో పట్టణ ప్రజల్లో కలవరం మొదలైంది. గోదావరి కాలువలో సమృద్ధిగా జలాలు ఉన్న సమయంలో వేసవి జలాశయానికి పూర్తిస్థాయిలో నీటిని నింపాలని మున్సిపల్ అధికారులకు ముందుచూపు కొరవడడం వల్లే ఈ ఏడాది వేసవి సీజన్‌లో తాగునీటి ఎద్దడి తప్పేలా లేదని పలువురు ఆందోళన చెందుతున్నారు. వేసవి జలాశయంలో నీటి మట్టం ప్రమాదస్థాయికి చేరుకుందని అధికారులు అంచనాలు వేస్తున్నారు. కాగా వెంకటకృష్ణరాయపురం గ్రామంలో సాగునీటి ఎద్దడి యథాతథంగానే ఉందని ఇరిగేషన్, వ్యవసాయశాఖల అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు రైతులనుంచి వినవస్తున్నాయి.



పీబీసీ కాలువ మీదుగా గోదావరి కాలువకు లాకులవద్ద మళ్లుతున్న జలాలు

పొగాకు సాగుకు.. తెగుళ్ల బెడద



కూలీలు కట్టిన పొగాకు తోరణాలు

- ఎకరానికి 13 నుంచి 7 క్వింటాళ్లకు పడిపోయిన దిగుబడి
- టుబాకో బోర్డు ఈ ఏడాది ధరలు పెంచాలంటున్న రైతులు
- గండేపల్లి మండలంలో 1500 ఎకరాల్లో సాగు

గండేపల్లి, మార్చి 2: రైతులకు సిరులు కురిపించే పొగాకు గతేడాది వర్షాల కారణంగా పంట ఊటబారిన పడి తెగుళ్ల సోకినష్టాన్ని మిగిల్చేలా ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గండేపల్లి మండలంలో మురారి, రామయంపాలెం, సింగరాయపాలెం తదితర గ్రామాల్లో ఎన్ఎల్ఎస్ 83, 53, 7 రకాల పొగాకు సాగు చేపట్టారు. ఈ పొగాకు మొక్క వేసినప్పటినుంచి కంటికి రెప్పలా కాపాడుకుంటూ రావాలి. ఈ సాగు కష్టంతో కూడుకున్న పనిఅని రైతులు చెబుతున్నారు. పండిన ఆకును కోసి తోరణాలుగా కట్టి బాయిల్ చేసేందుకు బేరల్‌లో కట్టి వారంరోజులపాటు బేరల్‌లో వేడి చేసి బెయిల్ వేసి మార్కెట్‌కు తరలించేందుకు సిద్ధం చేస్తారు.

తుఫాన్ల కారణంగా నష్టం

దేవరపల్లిలో టుబాకో బోర్డు సంవత్సరానికి ఒక్కసారి బోర్డు సభ్యులందరూ సమావేశం నిర్వహించి ప్రతినెలా మార్చిలో ధరను మద్దతు ధర కేటాయించి పొగాకును కొనుగోలు చేస్తారు. ప్రతి సంవత్సరం కూడా ఎకరానికి 13 క్వింటాళ్లు అయ్యేదని, ధర క్వింటాకి రూ.23వేలు ఇచ్చేవారని, పెట్టుబడులు పోయినా లాభాలు బాగా వచ్చేవని రైతులు అంటున్నారు. గతేడాది తుఫాన్ల కారణంగా పంట ఊటబారిన పడి ఆకు ఎదగకుండా, ముదరకుండా పండిపోయి రాలిపోతోందని, వైరస్ కూడా సోకి దిగుబడులు తగ్గిపోయాయని వారు చెబుతున్నారు. ఇలా అయితే నష్టాలు తప్పవని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కౌలురైతులు అయితే మరింత ఆందోళనగా ఉన్నారు. కౌలు రూ.50వేల నుంచి రూ.60వేలు ఉంటుందని, ఇదే దిగుబడి వస్తే నష్టాలు తప్పవని రైతులు అంటున్నారు. టుబాకో బోర్డు ఈ సంవత్సరం ధరను పెంచి కొనుగోలు చేయాలని వారు కోరుతున్నారు. ఉమ్మడి జిల్లాలో ఎక్కడా లేనివిధంగా గండేపల్లి మండలంలో ఈ పొగాకు సాగు అత్యధికంగా రైతులు పండిస్తున్నారు. ఈ సంవత్సరం లేబర్ చార్జీలు, బ్యారెల్‌లో వేడి చేసేందుకు పుల్లల ఖరీదు కూడా పెరిగిందని వారు అంటున్నారు. తమ ఆవేదనను గుర్తించి టుబాకో బోర్డుకు గిట్టుబాటు కలించేలా ధరలు కేటాయించాలని కోరుతున్నారు.



పొగాకు బాయిల్ చేసే బ్యారన్

వేసవి అలవెన్స్‌లు.. లేనట్లేనా?

- వేతనాలూ ఆలస్యమే
- ఉపాధి పనులపై ఆసక్తి చూపని కూలీలు
- రోజురోజుకూ నీరుగారుతున్న జాతీయ ఉపాధి హామీ పథకం

గండేపల్లి, మార్చి 2: నిరుపేదలకు ఉపాధి కల్పించాలని కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన జాతీయ గ్రామీణ ఉపాధి పథకం రోజురోజుకూ నీరుగారుతోంది. గతంలో పనికి వెళ్తే వేతనాలు వెంటనే పడేవి. ప్రస్తుతం పనిచేసినా ఐదు, ఆరు వారాలకు కూడా వేతనాలు పడకపోవడం, పనికి తగ్గ కూలీ రాకపోవడం వంటి కారణాలతో ఉపాధి పనిపై కూలీలు ఆసక్తి తగ్గిస్తున్నారు. ఎండాకాలం వచ్చిందంటే వేసవి భత్యం కింద పరికరాలకు అదనంగా సొమ్ములు వేసేది ప్రభుత్వం. గడ్డపారకు రూ.10, మంచినీటికి రూ.5, తట్టకు రూ.5 వేసవి అలవెన్స్‌లుగా ఉండేవి. రెండేళ్లుగా అవి కూడా రావడం లేదని కూలీలు అంటున్నారు. కనీసం పనిచేసే సమయంలో ఏ చిన్న గాయమైనా ఫస్ట్ ఎయిడ్ చేసుకోవడానికి కిట్లు ఇచ్చేవారని, అవి కూడా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేసవిలో టెంట్‌లు ఏర్పాటు చేయడంతోపాటు మజ్జిగ పంపిణీ వంటివి కూడా ఉండడం లేదని, ఉపాధి హామీని రోజురోజుకూ నీరుకారుస్తున్నారని కూలీలు వాపోతున్నారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు మండుటెండలో పనిచేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలవెన్స్‌లు సరిగా రాకపోవడంతో జిల్లావ్యాప్తంగా చాలా గ్రామాల్లో ఉపాధి కూలీల సంఖ్య తగ్గిపోతోందని తెలుస్తోంది.



హత్యా రాజకీయాలకు కేరాఫ్ అడ్రస్ వైసీపీ

- రూరల్‌లో మంత్రి అరాచకాలకు అంతంలేదు
- రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి ఫైర్



రాజమహేంద్రవరం రూరల్, మార్చి 2: రాష్ట్రంలో అధికార వైసీపీ హత్యారాజకీయాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిందని టీడీపీ సీనియర్ నేత రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. రాజమహేంద్రవరంలోని తన నివాసంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ ప్రభుత్వ అధికార యంత్రాంగాన్ని భ్రష్టు పట్టిస్తున్నారని మండిపడ్డారు. వైసీపీ అధికార పార్టీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రభుత్వాధికారులను భయభ్రాంతులకు గురిచేస్తూ తప్పుడు విధానాల్లో ఎన్నికల్లో గెలవాలనుకుంటున్నారని ఆరోపించారు. ప్రజల నుంచి దోచుకున్న సొమ్మును ప్రచార ఆర్భాటానికి ఫ్లెక్సీలకు ఉపయోగిస్తున్నారని, వలంటీర్ల వ్యవస్థను దుర్వినియోగం చేస్తూ దొంగ ఓట్లను చేర్చాలని అధికారులు ఒత్తిడికి గురిచేస్తున్నారన్నారు. ముఖ్యంగా రాజమహేంద్రవరం రూరల్‌లో మంత్రి గారి అరాచకాలకు అంతంలేకుండా పోయిందన్నారు. పంచాయతీ నిధులను ఫ్లెక్సీ ప్రచారాలకు వినియోగిస్తున్నారని మండిపడ్డారు. అంగన్వాడీలు, ఆశ వర్కర్లకు బహుమతులు ఇస్తూ అధికార దుర్వినియోగం చేస్తున్నారన్నారు. ప్రభుత్వ అనుమతి లేకుండా ప్రభుత్వ ఆస్తులను కొంత మంది ప్రైవేట్ వ్యక్తులకు కేటాయిస్తున్నారన్నారు. రాజమహేంద్రవరం కేంద్రంగా ఇసుక మాఫియా జగన్ రెడ్డి నడిపిస్తున్నాడని చెప్పారు. రోజుకు ఇసుకపై రూ.2 కోట్లు పైగా సొమ్ము దోచుకుంటున్నారని ఎన్‌జీటీ ఆదేశాలను కూడా ఇసుక మాఫియా లెక్కచేయడం లేదన్నారు. వైఎస్ వివేకానందరెడ్డిని జగన్‌రెడ్డి ముఠానే హతమార్చిందన్నారు. సీబీఐ విచారణ పిటిషన్ వేస్తానని సునీతమ్మ అంటే జగన్ ఎందుకు ఆపారని ,తొలుత విచారణకోరి అటుపై ఎందుకు ఆపారో జగన్ రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. సీఎంగా ఉండే అర్హత జగన్‌కు లేదన్నారు. ఈ సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కడియం ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఏడువారాల వెంకన్న గోవిందా...గోవిందా





ప్రత్యేక అలంకరణలో ఆత్రేయపురం వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి

ఆత్రేయపురం, మార్చి 2: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం భక్తజనంతో శోభిల్లింది. వేకువజామునే స్వామి వారికి సుప్రభాతసేవ, ఐశ్వర్యలక్ష్మిహోమం, బాలభోగం, తదితర కార్యక్రమాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. స్వామివారిని వివిధ రకాల సుంగధ పరిమాలలు వెదజల్లే ఫలపుష్పాలతో అలకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలి వచ్చిన భక్తులు స్వామివారి తిరువీధులలో ఏడు ప్రదక్షణలు నిర్వహించుకుని తలనీలాలు, తులాభారాలు, కానుకలు సమర్పించుకుని మొక్కులు తీర్చుకున్నారు. గోవిందనామస్మరణతో అశేషభక్తజనం స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. 35వేల నుంచి 40వేల మంది భక్తులు భారీ కూలైన్ల ద్వారా గంటల తరబడి వేచియున్న భక్తులు స్వామివారిని దర్శించుకుని మంత్ర ముగ్ధులయ్యారు. అనంతరం రాత్రి వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు భక్తులను అలరించాయి. వివిధ సేవలద్వారా స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.42.39 లక్షలు లభించినట్టు ఆలయ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, కార్యనిర్వాహకాధికారి, భూపతిరాజు కిషోర్‌కుమార్ తెలిపారు.

సచివాలయ ఉద్యోగుల యూనిఫామ్ రద్దుకు కృషి



సచివాలయ ఉద్యోగుల జిల్లా కమిటీకి సభ్యులకు నియామక ఉత్తర్వులు అందజేస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి

అమలాపురం టౌన్, మార్చి 2: సచివాలయ ఉద్యోగుల యూనిఫామ్స్ రద్దుకు కృషి చేస్తున్నట్టు ఏపీ గ్రామ, వార్డు సచివాలయ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కె.వెంకట్రామిరెడ్డి పేర్కొన్నారు. అమలాపురం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం జిల్లాశాఖ ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులతో నియమించబడ్డ మహిళా పోలీసుల పదోన్నతులు, జాబ్ చార్ట్ కూడా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డిని డీఆర్డీఏ పీడీ డాక్టర్ వి.శివశంకరప్రసాద్, రెవెన్యూ జేఏసీ రాష్ట్ర చైర్మన్ వాసా ఎస్.దివాకర్, ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, కుడుపూడి బాబులు మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. అనంతరం జిల్లాశాఖ నూతన కార్యవర్గాన్ని ఆయన ప్రకటించి నియామక ఉత్తర్వులు అందజేశారు. జిల్లాశాఖ అధ్యక్షుడిగా జగడం కిరణ్, ప్రధాన కార్యదర్శిగా మట్టపర్తి సముద్రం, వర్కింగ్ ప్రెసిడెంట్లుగా స్వామి, కృష్ణకుమారి, ఉపాధ్యక్షులుగా సవరపు రాజకుమారి, ప్రసాద్, ఎన్వీఎస్ఆర్ లక్ష్మి, చెల్లి నాగేంద్రకుమార్, కోశాధికారిగా ఎస్.శేషగిరితో పాటు కార్యవర్గ సభ్యులను ప్రకటించి నియామక ఉత్తర్వులను అందజేశారు.

సత్యదేవుడికి వెండి,బంగారు వస్తువుల అందజేత



ఈవోకు వెండి బకెట్, స్వామివారికి స్వర్ణ నేత్రాలు, కనుబొమ్మలు, మీసాలు అందజేస్తున్న పురోహితులు

అన్నవరం, మార్చి 2: రత్నగిరివాసుడైన సత్యదేవుడికి శనివారం అన్నవరం దేవస్థానం వ్రతపురోహితులు సుమారు 1.75లక్షల విలువైన వెండి బకెట్, స్వామివారికి బంగారు నేత్రాలు, కనుబొమ్మలు, మీశాలను అందజేశారు. వీటిని ఈవో రామచంద్రమోహన్‌కు సంఘ ప్రతినిదులు ఈవో రామచంద్రమోహన్‌కు అందజేశారు. ఈసందర్భంగా ఈవో వ్రతపురోహితలను అభినందించారు. ప్రతీఏటాదేవస్థానం వ్రతపురోహితులు సంఘం తరుపున స్వామి,అమ్మవార్లకు ఏదో ఒక వస్తువును అందించడం ఆనవాయితీగా చేస్తున్నారు.

సత్యదేవుడి సన్నిధిలో ఐపీఎస్ త్రివిక్రమ వర్మ పూజలు



త్రివిక్రమవర్మకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఈవో

రత్నగిరివాసుడైన సత్యదేవుడి సన్నిధిలో ఐపీఎస్ అధికారి త్రివిక్రమవర్మ కుటుంబసభ్యులతో స్వామిని దర్శించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ ఈవో రామచంద్రమోహన్ ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనాలు అందించగా ఈవో వారికి స్వామివారి ప్రసాదం, చిత్రపటం అందజేశారు.

బంగారు ధ్వజస్తంభ ప్రతిష్ఠకు సన్నాహాలు

సత్యదేవుడికి స్వర్ణ ధ్వజస్థంభం ప్రతిష్ఠపై సన్నాహాలు చేస్తున్నారు. నెల్లూరుకు చెందిన ఒకదాత వీటిని తయారు చేయిస్తున్నారు. ఏప్రిల్ 18 నుంచి 22 వరకు ప్రతిష్ఠా కార్యక్రమాలు చేపట్టాలని పండితులు భావిస్తున్నారు. ఈనెల 7న జరిగే పాలకమండలి సమావేశంలో దీనిపై స్పష్టత రానుంది. దీనికి సంబంధించి ఏర్పాట్లపై ఈవో రామచంద్రమోహన్, ఇంజనీరింగ్ అధికారులు, పండితులతో చర్చించారు. ధ్వజస్థంభం లోపలికి ఏవిధంగా తీసుకుని రావాలి అనేదానిపై చర్చించారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ అధికారులు రాంబాబు, ఉదయ్‌కుమార్ తదితరులున్నారు.

తిరుపతి ఆలయానికి పోటెత్తిన భక్తులు

- స్వామివారి ఆదాయం రూ.5,15,858



పెద్దాపురం, మార్చి 2: కాకినాడజిల్లా పెద్దాపురం మండలంలోని తిరుపతి శృంగారవల్లభస్వామి ఆలయానికి శనివారం భక్తులు అధిక సంఖ్యలో పోటెత్తారు. స్వామివారి దర్శనానికి భక్తులు తెల్లవారు జామునే బారులు తీరారు. టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.4,11,640 అన్నదానవిరాళాలు రూ.95,518 ఆదాయం, కేశఖండనద్వారా రూ.8,400, తులాభారం రూ.300 వెరసి రూ.5,15,858 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. సుమారు 20వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాన్ని స్వీకరించారని తెలిపారు. దేవస్థానం చైర్మన్ కర్రి జగదీష్, దేవస్థానం అర్చకులు పెద్దింటి నారాయణాచార్యులు, పురుషోత్తమాచార్యులు పాల్గొన్నారు.

భక్తుల తాకిడితో అప్పనపల్లి కిటకిట

మామిడికుదురు, మార్చి 2: భక్తుల తాకిడితో అప్పనపల్లి బాలబాలాజీ దేవస్థానం శనివారం కిటకిటలాడింది. వేకువజాము నుంచి భక్తులు వైనతేయ నదిలో స్నానమాచరించి స్వామివారి దర్శనానికి బారులు తీరారు. కొత్త, పాత గుడులు భక్తులతో కిటకిటలాడాయి. శనివారం స్వామివారిని 3964మంది దర్శించుకుని 3012మంది అన్నప్రసాదం స్వీకరించారని, వివిధ ఆర్జిత సేవల టిక్కెట్ల విక్రయాల ద్వారా రూ.2,51,139 ఆదాయంగా వచ్చిందని ఏసీ జి.మాధవి తెలిపారు. భక్తులకు ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకుండా ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

సిద్ధి వినాయకుడికి బంగారు పళ్లెం బహూకరణ



చైర్మన్‌కు బంగారు పల్లెం అందజేస్తున్న దాతలు

అయినవిల్లి, మార్చి 2: అయినవిల్లి విఘ్నేశ్వరస్వామి వారికి ఓ భక్తుడు బంగారు పళ్లెం, వెండి బిందెలను సమర్పించారు. వీరవల్లిపాలానికి చెందిన సూతాపల్లి సత్యనారాయణ-బాలదుర్గాకుమారి దంపతులు శనివారం విఘ్నేశ్వరస్వామిని దర్శించి రూ.5.10లక్షల విలువైన 81.600 గ్రాముల బంగారు పళ్లెం, రూ.80వేలు విలువైన 1003 గ్రాముల వెండి బిందెను అందజేశారు. శ్రీవిఘ్నేశ్వర అన్నప్రసాద ట్రస్టుకు రూ.20వేలు విరాళంగా ఇచ్చారు. భక్త దంపతులకు అర్చకులు వేదఆశీర్వచనం చేసి శేషవస్త్రంతో సత్కరించారు. ఆలయ చైర్మన్ గుత్తుల నాగబాబు స్వామివారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మక్తలు, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా భీమశంకరస్వామి కల్యాణం



పూజలు చేస్తున్న నవీన్ దంపతులు

జగ్గంపేట, మార్చి 2: కాకినాడజిల్లా జగ్గంపేట మండలం ఇరిపాకలో జ్యోతుల నెహ్రూ కుటుంబం ఆధ్వర్యంలో జరుగుతున్న కోటి పార్థివ లింగం మహారుద్రాభిషేకం శనివారం 6వ రోజు విఘ్నేశ్వర పూజ, పరిషత్ పంచగవ్య ప్రాసన, గోపూజ, మహా న్యాసము, రుద్రాభిషేకము, బిల్వార్చన, కుంకుమార్చన, నవగ్రహ హోమం, వంటిపూజా కార్యక్రమాలు నిర్వహించారు. జ్యోతుల నెహ్రూమణి, జ్యోతుల నవీన్ లక్ష్మీదేవి, తోట సర్వారాయుడు సునీత దంపతులు పీటలపై కూర్చుని భీమశంకర్‌స్వామి వారి కల్యాణం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పిఠాపురం విశ్వవిద్యాల ఆధ్యాత్మిక పీఠం పీఠాధిపతి డాక్టర్ అమర్ ఆలీషా హాజరై మహారుద్రాభిషేకంలో పాల్గొన్నారు. వేలాదిగా భక్తులు పాల్గొని అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమర్ ఆలీషా మాట్లాడుతూ భగవంతుడు సంకల్పంతో ఈ కోటి మహా రుద్రాభిషేకం నిర్వహించడం ప్రతిరోజు ఏదో ఒక పీఠం నుంచి ఒక పీఠాధిపతిని తీసుకొచ్చి ఆశీస్సులు అందించడం, భక్తితత్వాలు వినిపించడం ఓ మహోన్నత కార్యక్రమం అన్నారు. గోకవరంనకు చెందిన ఆధ్యాత్మిక భక్తుడు తోట సాయి శివతత్వం. రామతత్వం గురించి భక్తులకు వివరించారు. కార్యక్రమంలో కోర్పు లచ్చయ్య దొర, ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, కుంచే రాజా, జీను మణిబాబు, పైడిపాల సూరిబాబు, రేఖ బుల్లిరాజు, పారంశెట్టి రవి, కుంచే రామకృష్ణ, సూరంపాలెం బాలు, సీఎం, పారంశెట్టి బాబ్జి తదితరులు పాల్గొన్నారు.



కోటి మట్టి శివలింగాలకు అభిషేకం చేస్తున్న ఉమర్ అలీషా

విద్యార్థులను ఢీకొన్న కారు

- ఐదుగురికి గాయాలు ● మద్దూరులంక బ్యారేజ్‌పై ఘటన



మద్దూరులంక బ్యారేజ్‌పై ప్రమాదానికి గురైన కారును పరిశీలిస్తున్న పోలీసులు, కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు

కొవ్వూరు, మార్చి 2: కారు ఢీకొని ఐదుగురు విద్యార్థులు గాయపడిన సంఘటన కొవ్వూరు మండలం మద్దూరులంక గ్రామంలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం గ్రామానికి చెందిన సూరిశెట్టి సీతామహాలక్ష్మి, అల్లం మనోజ్‌కుమార్, ఆకుల రామవెంకటదుర్గ, రెంపా విర్షిత్, కె.అఖిల్ సైకిళ్లపై శనివారం ఉదయం మద్దూరులోని హైస్కూల్‌కు బయలుదేరారు. బ్యారేజ్‌పై వెనుక నుంచి వస్తున్న కారు విద్యార్థులను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో విద్యార్థులు కిందపడి గాయాలపాలయ్యారు. దీంతో వారిని కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వెంకటదుర్గ, సీతామహాలక్ష్మిలకు బలమైన గాయాలు కావడంతో రాజమహేంద్రవరం రిఫర్ చేశారు. అల్లం మనోజ్‌కుమార్ తండ్రి చిట్టివీరన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు రూరల్ హెడ్ కానిస్టేబుల్ కె.శ్రీనివాసరావు తెలిపారు.

భార్యను కడతేర్చిన కసాయి భర్త

- అక్రమ సంబంధాన్ని ప్రశ్నించడమే ఆమె చేసిన పాపం
- వివాహేతర బంధానికి అడ్డుగా ఉందని.. భార్యను కొట్టి చంపేశాడు
- ఆపై ఆత్మహత్యగా చిత్రీకరణ
- పోలీసు విచారణలో నేరం అంగీకారం



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు, మృతురాలు తానెం లక్ష్మి(ఫైల్)

నల్లజర్ల, మార్చి 2: తమ వివాహేతర బంధానికి అడ్డుగా ఉందని తన భార్యను అత్యంత క్రూరంగా కొట్టి చంపేశాడు. వివరాలిలా ఉన్నాయి. నల్లజర్ల మండలం జగన్నాథపురానికి చెందిన తానెం విష్ణు ఆయిల్‌పామ్ గెలల కోత కార్మికుడిగా చేస్తున్నాడు. 2012లో అదే గ్రామానికి చెందిన లక్ష్మి(28)ని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. వారికి ఇద్దరు పిల్లలు. లక్ష్మి గత ఆదివారం జంగారెడ్డిగూడెంలో ఉంటున్న తన సోదరి పెద్దింట్లు ఇంటికి వెళ్లి సాయంత్రం తిరిగి వచ్చే సమయానికి విష్ణు తన ఇంట్లో వేరే మహిళతో ఉండడం చూసి గొడవ పడి ంది. అప్పటి నుంచి ప్రతిరోజూ ఏదొక సమయంలో గొడవలు పడుతున్నారు. తమ వివాహేతరబంధానికి భార్యఅడ్డుగా ఉంటుందని భావించిన విష్ణు శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో భార్య నోట్లో గుడ్డలు కుక్కి అత్యంత దారుణంగా చిత్రహింసలకు గురిచేసి చంపేశాడు. మృతదేహాన్ని ఫ్యాన్‌కి వేలాడదీసి ఆత్మహత్య చేసుకున్నట్టు చిత్రీకరించాడు. అదే గ్రామంలో చదువుతున్న కుమార్తె మహి, కుమారుడు రాంచరణ్‌ను పిలిచి.. అమ్మమ్మ ఇంటికి వెళ్లి అమ్మ ఆత్మహత్య చేసుకుని చనిపోయిందని చెప్పమని కబురు పంపించాడు. వారంతా వచ్చి చూడగా లక్ష్మి ఫ్యానుకు ఉరితో వేలాడుతూ విగతజీవిగా కనిపించింది. భర్తపై అనుమానంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ టీవీ సురేష్ మృతదేహాన్ని పరిశీలించగా శరీరమంతా గాయాలు ఉండడం గమనించి హత్య కేసుగా నమోదు చేశారు. నిందితుడు విష్ణును పోలీసులు అదుపులోకి తీసుకొని ప్రశ్నించగా తానే హత్యచేసినట్టు అంగీకరించాడు.

శివకోటిలో భారీ దొంగతనం

- రూ.20లక్షలు విలువచేసే బంగారం, వెండి, నగదు అపహరణ



శివకోటిలో తలుపులు బద్దలకొట్టిన దొంగలు

రాజోలు, మార్చి 2: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలు మండలం శివకోటిలో గాదె వెంకటసూర్యరామ మురళీకృష్ణ ఇంట్లో దొంగలు చొరబడి తాళాలు పగులకొట్టి, ఇంట్లో ఉన్న రూ.20లక్షల విలువచేసే బంగారం, వెండి, నగదును దోచుకువెళ్లారని శనివారం రాజోలు ఎస్ఐ జి.పృథ్వి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మురళీకృష్ణ కుటుంబ సభ్యులు గత నెల 28న కుటుంబ సభ్యులతో వివాహ వేడుకకు మచిలీపట్నం వెళ్లారు. శుక్రవారం రాత్రి ఇంటికి వచ్చేసరికి తలుపులు బద్దలకొట్టి ఉన్నాయి. లోపలకు వెళ్లి చూడగా బీరువాలో ఉన్న బంగారం, వెండి, నగదును దొంగలు దోచుకువెళ్లారు. దీంతో దొంగతనం జరిగిందని భావించిన మురళీకృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సంఘటనా స్థలానికి రాజోలు ఎస్ఐ పృథ్వి తన సిబ్బందితో వచ్చి పరిశీలించారు. డాగ్‌స్క్వాడ్, క్లూస్‌టీములు చేరుకుని ఆధారాలు సేకరించారు. మురళీకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ పృథ్వి తెలిపారు.

పడవ ప్రమాదంలో మత్స్యకారుడు మృతి



కొపనాతి కోదండ

ఉప్పలగుప్తం, మార్చి 2: వాసాలతిప్ప ప్రాంతంలో చేపల వేటకు వెళ్లిన బోటు తిరగబడి అల్లవరం మండలం నక్కా రామేశ్వరంనకు చెందిన కొపనాతి కోదండ(40) మృతి చెందాడు. నక్కారామేశ్వరంనకు చెందిన ఆరుగురు మత్స్యకారులు శనివారం ఉదయం పంతాడి పెంటయ్యకు చెందిన ఇంజన్ బోటులో సముద్రంలో చేపల వేటకు వెళ్ళారు. చల్లపల్లి పంచాయతీ వాసాలతిప్ప తీరంలో సముద్రంలో వేటాడుతుండగా బోటు తిరగబడింది. ఈ ప్రమాదంలో కొపనాతి కోదండ సముద్రంలో మునిగి ఊపిరాడక మృతి చెందాడు. పడవలోని మిగిలిన అయిదుగురు సురక్షితంగా బయటపడ్డారు. మృతుని సోదరుడు శివయ్య ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ కె.మనోహర్‌జోషీ తెలిపారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి

గోపాలపురం, మార్చి 2: గోపాలపురం శివారు పొగాకుబోర్డు సమీపంలో శనివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. సీఐ కే.బాలసురేష్ బాబు వివరాల ప్రకారం.. చాగల్లు గ్రామానికి చెందిన ఆంజనేయులు దేవరపల్లి నుంచి ద్విచక్రవాహనంపై గోపాలపురం వైపు వస్తుండగా గోపాలపురం వైపు నుంచి వెళ్తున్న లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు. కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చామన్నారు. ఆయన వెంట ఎస్ఐ కె.సతీష్‌కుమార్ ఉన్నారు.



ఎగుమతి చేసేందుకు సిద్ధం చేస్తున్న పచ్చిమామిడికాయలు

కొండెవరం టూ కలకత్తా పచ్చిమామిడి ఎగుమతి

కొండెవరం (కొత్తపల్లి), మార్చి 2: ఎండాకాలం వచ్చేసింది. పచ్చిమామిడికాయలు ఎగుమతిచేసే సీజన్ ఆరంభమైంది. కాకినాడజిల్లా కొత్తపల్లి మండలం కొండెవరం నుంచి కలెక్టర్ రకం పచ్చిమామిడికాయలను కలకత్తా ఎగుమతి చేసేందుకు రైతుల నుంచి సేకరిస్తున్నారు. కొండెవరంలో మూడు కేంద్రాల నుంచి పచ్చిమామిడి కాయలను సేకరించేందుకు కేంద్రాలను సిద్ధం చేశారు. చేలల్లోనుంచి కోసుకొచ్చిన పచ్చిమామిడికాయలను కిలో రూ.35లకు వర్తకులు టోకుగా కొనుగోలు చేస్తున్నారు. వీటిని కలకత్తా నగరానికి రవాణా చేస్తామని కొనుగోలు దారుడు జి.కోటి చెప్పారు.

స్వల్పకాలిక శిక్షణా కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

ధవళేశ్వరం, మార్చి 2: పీఎంకేవీవై పథకంలో భాగంగా జిల్లాలోని నిరుద్యోగ యువతకు అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్, డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్‌కు సంబంధించి స్వల్పకాలిక కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్టు ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ ఎల్ఆర్ఆర్ కృష్ణన్ ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 45ఏళ్ల మధ్య వయసుండి పదో తరగతి ఆపై విద్యార్హత ఉన్న అభ్యర్థులు ఆధార్‌కార్డు జిరాక్స్, ఈమెయిల్ ఐడీ, ఫోన్ నెంబర్లతో ఈనెల 15 లోపుగా కార్యాలయ పనివేళల్లో సంప్రదించాలని కోరారు. వివరాలకు 92420 50231లో సంప్రదించాలని కోరారు.

జింకపై వీధి కుక్కల దాడి

- రక్షించిన స్థానికులు
- ఫారెస్టు అధికారులకు అప్పగింత



కుక్కల దాడిలో గాయపడ్డ జింక

మోతుగూడెం, మార్చి 2: చింతూరు మండలం మోతుగూడెంలో శనివారం పోస్టు ఆఫీస్ సెంటర్‌లో ఉదయం అడవిలో నుంచి జింక ఊరులోకి వచ్చింది. దానిపై ఒక్కసారిగా వీధి కుక్కలు దాడి చేశాయి. దాన్ని గమనించిన స్థానికంగా నివాసం ఉంటున్న ఏపీ జెన్కో ఉద్యోగులు వీధి కుక్కల నుంచి జింకను రక్షించారు. అనంతరం ఫారెస్ట్ సిబ్బందికి ఫోన్ చేసి జింకను అప్పగించారు. పశువైద్యాధికారి వద్ద ప్రథమ చికిత్స చేయించి పెద్ద పొలాల అడవిలో వదిలిపెట్టారు.

అపరిచిత వ్యక్తులతో జాగ్రత్తగా ఉండండి

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్టు



నిందితులను పట్టుకుని వివరాలు తెలుపుతున్న డీఎస్పీ రామారావు

గోపాలపురం, మార్చి 2: గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్టు డీఎస్పీ కేసీహెచ్ రామారావు తెలిపారు. శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. కర్ణాటక రాష్ట్రానికి చెందిన సీకే గౌతమ్‌రాజ్, కేఎస్ వినయ్‌కుమార్ పువ్వుల వ్యాపారంలో నష్టం రావడంతో అధిక ధనార్జన కోసం గంజాయి వ్యాపారానికి తెరదీశారు. ముందస్తు సమాచారంతో శుక్రవారం సాయంత్రం గోపాలపురం మండలం జగన్నాధపురం శివారులో ఏర్పాటుచేసిన బోర్డరు చెక్‌పోస్టు వద్ద దేవరపల్లి సీఐ బాలసురేష్‌బాబు, ఎస్ఐ సతీష్‌కుమార్, రెవెన్యూ సిబ్బందితో తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో గంజాయి తరలిస్తున్న ఇద్దరినీ అదుపులోకి తీసుకుని వారివద్ద నుంచి 4.290కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నామన్నారు.

చోరీ కేసులో నిందితుల అరెస్టు

తెలంగాణ రాష్ట్రం ములుగుజిల్లా మంగపేట గ్రామం దేవత హనుమంత రావు అపరాల వ్యాపారం చేస్తుంటాడు. అతడి వద్ద తెలంగాణకు చెందిన బైట్ల సాయిబాబా 20 ఏళ్లుగా గుమస్తాగా పని చేస్తున్నాడు. వ్యాపారంలో భాగంగా సాయిబాబా తరచూ అపరాలు కాకినాడ తీసుకెళ్లి అమ్ముతుంటాడు. అక్కడ అపరాలు అమ్మిన సొమ్ము రూ.7,45,000 బ్యాగులో పెట్టుకుని గత నెల 29వ తేదీన బస్సు ఎక్కి రాజమండ్రిలో దిగాడు. అక్కడ సాయిబాబాకు గతంలో పరిచయం ఉన్న అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట గ్రామానికి చెందిన ఏర్నేటి విజయకుమారి, ఆమె మేనల్లుడు మాడా మణికుమార్ తారసపడ్డారు. తాము కూడా తెలంగాణ వస్తున్నామని చెప్పి సాయిబాబాతో పాటు రాజమండ్రిలో బస్సు ఎక్కారు. గోపాలపురం చెక్‌పోస్టు సెంటర్‌కి వచ్చేసరికి సాయిబాబా నిద్రపోతున్న సమయంలో ఇద్దరూ సొమ్ము ఉన్న బ్యాగును దొంగిలించి బస్సు దిగి పారిపోయారు. మెలకువ వచ్చి చూడగా సాయిబాబా దగ్గర సొమ్ములున్న బ్యాగ్ కనిపించకపోవడంతో గోపాలపురం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు దేవరపల్లి సీఐ బాలసురేష్‌బాబు, ఎస్ఐ కె.సతీష్ కుమార్ మండపేట వెళ్లి విజయకుమారి, మణికుమార్‌లను చాకచక్యంగా అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.7,45,000 రికవరీ చేశారని, వారి వెంట హెడ్‌కానిస్టేబుల్ సత్యానందం, పోలీస్ సిబ్బంది ఉన్నారని డీఎస్పీ రామారావు తెలిపారు.

సత్యదేవా నర్సరీని సందర్శించిన ఆర్‌బీఐ బృందం

కడియం, మార్చి 2: కడియపులంకలో సత్యదేవానర్సరీని శనివారం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) రీజనల్ డైరెక్టర్ ఏవో బషీర్, జీఎం అనుజ్ రాజన్, జీఎం మేఘనసింగ్, డీజీఎం అనతి తదితరులు సందర్శించారు. నర్సరీ అధినేత పుల్లా అబ్బులు ఆర్‌బీఐ అధికారికి థాయ్ ఆగ్లోనిమా అనే మొక్కను అందజేసి స్వాగతించారు. అధికారులు నర్సరీలో వివిధ రకాల మొక్కలు పరిశీలించారు. వాటి వివరాలు, శాస్త్రీయ నామాలను పుల్లా వీరబాబు, రాజశేఖర్‌లు వివరించారు. నర్సరీరంగ అభివృద్ధికి బ్యాంకుల మద్దతు ఎప్పుడూ ఉంటుందని, త్వరలో బ్యాంకు కార్యాలయాలు రానున్నాయని వాటి సుందరీకరణకు మొక్కల అవసరం నిమిత్తం వారు నర్సరీని సందర్శించామన్నారు. వారి వెంట రాజమహేంద్రవరం యూనియన్ బ్యాంక్ అధికారులు ప్రసాద్, క్రిష్టయ్య తదితరులున్నారు.



ఆర్‌బీఐ అధికారికి మొక్కను అందజేస్తున్న పుల్లా అబ్బులు

మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు

తుని రూరల్, మార్చి 2: ఏపీ ఆదర్శ (మోడల్)పాఠశాలలో 6వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు హంసవరం మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 3 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఏప్రిల్ 21న ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. మోడల్ స్కూల్‌లో 2024-25 విద్యా సంవత్సరానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని, విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

‘టీడీపీ సూపర్ సిక్స్ పథకాలతో ప్రజలకు మేలు’

తొండంగి, మార్చి 2: తెలుగుదేశం పార్టీ ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాల ద్వారా ప్రజలందరికీ మేలు జరుగుతుందని తెలుగురైతు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పేకేటి హరికృష్ణ పేర్కొన్నారు. శనివారం ఒంటిమామిడి క్లస్టర్‌లో బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా ఆయన ప్రజలకు పథకాలపై వివరించారు. నిరుద్యోగ భృతి కల్పించడం, ఉచితంగా గ్యాస్ సిలెండర్లు అందించడం, మహిళలకు ఉచిత బస్ సౌకర్యం కల్పించడం తదితర పథకాల ద్వారా సంక్షేమ పాలన చేసేందుకు టీడీపీ సిద్ధంగా ఉందన్నారు. రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ తమకు మద్దతిచ్చి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా మత్స్యకార అధ్యక్షుడు కోడ వెంకటరమణ, పార్టీ మండలాధ్యక్షుడు చొక్కా అప్పారావు, ప్రధాన కార్యదర్శి మురాలశెట్టి సత్యన్నారాయణ, చొక్కా కాశీశ్వరరావు, తాటిపర్తి శ్రీను ఉన్నారు.

‘ఆనర్స్, మైనర్స్ చదివేందుకు 53 మంది అర్హత’

జేఎన్టీయూకే, మార్చి 2: యూసీఈకేలో ఆర్19 నిబంధనల్లో భాగంగా మొదటిసారిగా బీటెక్‌లో ఈసీఈ, సీఎస్‌ఈతో ఆనర్స్, మైనర్స్‌లో కోర్సును ప్రారంభించినట్టు ఉపకులపతి జీవీఆర్ ప్రసాదరాజు తెలిపారు. అయితే యూసీఈకేలో మొత్తం 430మంది ప్రవేశాలు పొందగా వారిలో 53మంది విద్యార్థులు ఆనర్స్, మైనర్స్ చదివేందుకు అర్హత సాధించారన్నారు. వీసీ సమావేశహాల్లో శనివారం బీటెక్ ఈసీఈతో మైనర్ ఇన్ సీఎస్‌ఈ పూర్తిచేసిన వై.లక్ష్మీసాయికృష్ణకు ప్రొవిజనల్ సర్టిఫికెట్‌లను అందజేశారు. ఆయన మాట్లాడుతూ బ్యాక్‌లాగ్స్ లేకుండా కోర్సును పూర్తిచేసిన విద్యార్థులకు బీటెక్ ఈసీఈ మైనర్ ఇన్ సీఎస్‌ఈ డిగ్రీ ప్రొవిజనల్ సర్టిఫికెట్లను జారీచేస్తున్నామన్నారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎంహెచ్‌ఎం కృష్ణప్రసాద్, వైస్‌ప్రిన్సిపాల్ రత్నకుమారి పాల్గొన్నారు.

7న మాదిగల రాజకీయ చైతన్య సభ

కాకినాడ సిటీ, మార్చి 2: డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం మండలం రావులపాడు హైవే రోడ్‌లో ఈనెల 7న జరిగే మాదిగల రాజకీయ చైతన్య సభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బజ్జంగి సుధాకర్ పిలుపునిచ్చారు. కాకినాడ శాంతిభవన్ హాల్‌లో ఏర్పాటు చేసిన ఎమ్మార్పీఎస్ఎస్ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాదిగల రాజకీయ చైతన్య సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఎమ్మార్పీఎస్ఎస్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో జరిగే ఈ సభలో మాదిగ, మాదిగ ఉపకులాల వారు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్ని రాజకీయ పార్టీలకు మన సత్తా ఏంటో చూపాలన్నారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ఎస్ కాకినాడ జిల్లా అధ్యక్షుడు యార్లగడ్డ వరప్రసాద్, కాకినాడ సిటీ అధ్యక్షుడు పలివెల విజయ్‌కుమార్, జిల్లా గౌరవ అధ్యక్షుడు నవరపు నాగరాజు, జిల్లా కోశాధికారి బండి యాదగిరి పాల్గొన్నారు.

‘మత్స్యకారుల జీవితాల అభివృద్ధికి సిద్ధం’

కార్పొరేషన్ (కాకినాడ), మార్చి 2: మత్స్యకారుల జీవితాలను అభివృద్ధి చేయడానికి యుద్ధానికి మేము సిద్ధమేనని జనసేన పార్టీ సిటీ ఇన్‌చార్జి ముత్తా శశిధర్ అన్నారు. నగరంలోని 10వ డివిజన్ దుమ్ములపేట అబ్రహామ్ చర్చి ప్రాంతంలో మోస ఏసుబు ఆధ్వర్యంలో జనసేన మేము సిద్ధం కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా శశిధర్ మాట్లాడుతూ రాష్ట్రంలో యువత బతుకులు చిన్నాభిన్నమయ్యాయన్నారు. కార్యక్రమంలో తలాటం సత్య, కొంద్రు దుర్గాప్రసాద్, మోసా ఆనంద్, దేవదాస్, పేతూరు, మెరుగు మోహన్, కోటేశ్వరరావు, కుమార్, సత్తిబాబు పాల్గొన్నారు.

‘ప్రజల అభ్యున్నతికి సంక్షేమ కార్యక్రమాలు’

ప్రత్తిపాడు, మార్చి 2: దేశంలో అట్టడుగు వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం ప్రధాని నరేంద్రమోదీ అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారని బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు సింగిలిదేవ్ సత్తిరాజు చెప్పారు. ప్రత్తిపాడులో శనివారం బీజేపీ మండలాధ్యక్షులు కందా వీరస్వామి ఆధ్వర్యంలో ప్రజాపోరుయాత్ర నిర్వహించారు. సత్తిరాజు మాట్లాడుతూ ప్రధాని మోదీ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి మళ్లీ కేంద్రంలో బీజేపీకి మరొక్కసారి అధికారం కల్పించాలని కోరారు. బీజేపీ జిల్లా కార్యదర్శి కొల్లా శ్రీనువాస్, విస్తరక్ యార్లగడ్డ వెంకట్రావు, మండల కార్యదర్శి ఇంటి బాబురావు తదితరులున్నారు.

‘బ్యాంక్ సేవలు విస్తరించేందుకు అక్షర కేంద్రాలు’

ప్రత్తిపాడు, మార్చి 2: బ్యాంక్ సేవలు విస్తరించేందుకు, ప్రజలకు బ్యాంకు సేవలు వివరించేందుకు ఆర్థిక అక్షర కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్టు యూనియన్ బ్యాంక్ రీజనల్ హెడ్ సాయి మనోహర్ తెలిపారు. ప్రత్తిపాడులో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫార్మేషన్ ఎన్‌జీవో ఆర్థిక అక్షరాస్యత కేంద్రాన్ని శనివారం మనోహర్ ప్రారంభించారు. ప్రాజెక్టు డైరెక్టర్ వి.ఆంజనేయులు, ప్రాజెక్టు మేనేజర్ అశోక్‌కుమార్, డిస్ట్రిక్ కో ఆర్డినేటర్ ఎస్.హరి, స్థానిక యూబీఐ మేనేజర్ చందన్‌కుమార్, స్టేట్ కో ఆర్డినేటర్ బాబురావు, ఏపీఎం వెంకట్, వై.వెంకట్రావు ఉన్నారు.

‘ప్రజా సేవ చేయడానికే ఆంధ్ర రాష్ట్ర సమితి’

కోటనందూరు, మార్చి 2: ప్రజా సేవ చేయడానికే ఆంధ్ర రాష్ట్ర సమితి పార్టీ ఏర్పాటు చేశామని పార్టీ వ్యవస్థాపకుడు జెకోటేశ్వరరావు అన్నారు. శనివారం కోటనందూరులో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ తమ పార్టీ పేదబడుగు బలహీన వర్గాల కోసం పని చేస్తోందన్నారు. వచ్చే ఎన్నికల్లో ఏఆర్ఎస్‌ను అధికారంలోకి తీసుకువస్తే విద్యవైద్యం ఉచితంగా అందిస్తామన్నారు. బీసీలకు అండగా నిలుస్తామని, ప్రజలు తమ పార్టీని ఆదరించాలని కోరారు. జెపద్మ, బాషా, అమ్మర్లపూడి జోష్‌నానా ఉన్నారు.

‘బీసీలకు సముచిత స్థానం కల్పించాలి’

కాకినాడ రూరల్, మార్చి 1: రాబోయే ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు సీట్ల కేటాయింపుల్లో బీసీలకు సముచిత స్థానం కల్పించాలని శెట్టిబలిజ జనజాగృతి సేవా సంఘం అధ్యక్షుడు రాయుడు నాగేశ్వరరావు, జనరల్ సెక్రటరీ కర్రి గోపాలకృష్ణ, బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వాసంశెట్టి భీమరాజు కోరారు. కాకినాడలోని ఓప్రైవేట్ హోటల్లో శనివారం రెండు సంఘాల అధ్యక్షుల ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. రెండు సంఘాల నాయకులు మేడిశెట్టి లక్ష్మణ్, గుత్తుల రమణ, రాయుడు దుర్గ, కాళ్లసత్తిబాబు,చింతాకుల శ్రీనివాస్, రాయుడు సుధాకర్ పాల్గొన్నారు.

కంప్యూటర్ శిక్షణా తరగతులు ప్రారంభం

తొండంగి, మార్చి 2: పెరుమాళ్ళపురం డిగ్రీ కళాశాలలో శనివారం కంప్యూటర్ నైపుణ్య శిక్షణా తరగతులను అరబిందో ఫార్మా ఫౌండేషన్ జనరల్ మేనేజర్ డి సుధాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత కంప్యూటర్‌లో నైపుణ్యం సాధించినపుడే మెరుగైన ఉపాధి అవకాశాలు కలుగుతాయన్నారు. డిగ్రీ స్థాయి నుంచే దీనిని సాధించాలన్న లక్ష్యంతో తమ సంస్థ తరఫున శిక్షణా కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. అరబిందో సంస్థ అందిస్తున్న సహకారాన్ని అందిపుచ్చుకుని ప్రతి ఒక్కరూ రాణించాలని ప్రిన్సిపాల్ డాక్టర్ మెహర్ సూచించారు. కోర్సు కోఆర్డినేటర్ కెవికృష్ణారావు, కౌన్సిలర్ ఫణీంద్ర లైబ్రేరియన్ రాము తదితరులున్నారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం

కొత్తపల్లి, మార్చి 2: స్థానిక సురక్షప్యాలెస్ కన్వెన్షన్ హాలులో శనివారం నిర్వహించిన కిరణ్ కంటి ఆసుపత్రి ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని కొత్తపల్లి సురక్ష మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ అధినేత డాక్టర్ జ్యోతుల శ్రీనివాస్ ప్రారంభించారు. కిరణ్ కంటి ఆసుపత్రి వైద్య నిపుణులు చైతన్య, తేజ ఆధ్వర్యంలో 400మందికి నేత్ర పరీక్షలు నిర్వహించారు. వారిలో 102 మందికి కంట్లో శుక్లాల ఆపరేషన్ కోసం గుర్తించి ఆసుపత్రికి తరలిస్తున్నట్టు శ్రీనివాస్ చెప్పారు. సర్పంచ్ గవర నాగేశ్వరరావు, శెట్టిబలిజ నేత కొప్పిశెట్టి నాగేశ్వరరావు, ఎస్‌నాగేశ్వరరావు, సత్యనారాయణ,గెడ్డం దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

ప్రత్తిపాడు, మార్చి 2: ప్రత్తిపాడులో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం ద్రోణంరాజు కిరణ్‌కుమార్ సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని క్లబ్ అధ్యక్షుడు ఇంజనీర్ మోహన్ ప్రారంభించారు. శిబిరంలో 90 మందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మాజీ సర్పంచ్ మూరా వరప్రసాద్, క్వారీ కార్మిక సంఘ అధ్యక్షుడు ఎం.చిన్నిబాబు, లయన్స్ రెడ్డి నాయకుడు, ఫకీర్‌రాజు, ఇంధన ఏసుబాబు, సాంబు, పిల్లా పద్మరావు, సంజీవరావు, గొంప రామకృష్ణ ఉన్నారు.

ఆస్తిపన్ను బకాయిల చెల్లింపుపై వడ్డీ రాయితీ

పిఠాపురం, మార్చి 2: పన్నుల బకాయిల చెల్లింపుపై వడ్డీ రాయితీ కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని మున్సిపల్ కమిషనరు కనకారావు తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మార్చి నెలాఖరు వరకూ ఉన్న ఇంటి, ఖాళీస్థలాల పన్నులను ఏకకాలంలో 31లోగా చెల్లిస్తే వడ్డీ మాఫీ చేస్తూ ఆదేశాలు వచ్చాయన్నారు.

సినిమా గైడ్

కాకినాడ

ఆనంద్ సినిమాస్ 4 స్క్రీన్స్: ఆపరేషన్ వాలెంటైన్, భూతద్ద భాస్కర్, చారీ 111, కిక్, ఊరు పేరు భైరవకోన

దేవీ మల్టీప్లెక్స్ 4 స్క్రీన్స్: ఆపరేషన్ వాలెంటైన్, భూతద్ద భాస్కర్, చారీ 111, కిక్, ఊరు పేరు భైరవకోన

తిరుమల	అంబాజీపేట మ్యారేజిబ్యాండు
లక్ష్మి	ఆపరేషన్ వాలెంటైన్
సీ అండ్‌సీ1	హనుమాన్
సీ అండ్‌సీ2	ఆపరేషన్ వాలెంటైన్
శ్రీప్రియ	సుందరంమాస్టర్
పద్మప్రియ	ఆపరేషన్ వాలెంటైన్
సత్యగౌరి	భూతద్దం భాస్కర్
సూర్య 1	ఆపరేషన్ వాలెంటైన్
సూర్య 2	కిక్

ఆసరా చెక్కుల పంపిణీ

కోటనందూరు, మార్చి 2: మండలంలోని కాకరపల్లి గ్రామంలో శనివారం నాల్గో విడత ఆసరా పథక నిధుల చెక్కుల పంపిణీ జరిగింది. మంత్రి దాడిశెట్టి రాజా ముఖ్యఅతిథిగా హాజరై చెక్కులను అందజేశారు. తమ ప్రభుత్వ పాలనలో రాష్ట్రం సంక్షేమం, అభివృద్ధి దిశగా పరుగులు తీసిందన్నారు. కార్యక్రమంలో తుని మార్కెట్‌యార్డ్ చైర్మన్ మాకినీడు బాబు, వైస్‌చైర్మన్ వెలగా వెంకట కృష్ణాజీ, ఎంపీపీ శ్రీనివాస్, బుంటుపల్లి గంగాధర్, లాలం బాబ్జీ, నల్లమల్లి గోవింద్, సుర్లరాజు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ ఉన్నతికి పాటుపడాలి

రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ యనమల కృష్ణుడు


తుని రూరల్: టీడీపీలో చేరినవారితో కృష్ణుడు

తుని రూరల్, మార్చి 2: టీడీపీ ఉన్నతికి కార్యకర్తలు పాటుపడాలని రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ యనమల కృష్ణుడు పిలుపునిచ్చారు. ఎస్.అన్నవరం పంచాయతీ పరిధిలో పలువురు వైసీపీ నాయకులు ఆ పార్టీకి రాజీనామా చేసి టీడీపీలోకి చేశారు. వారికి కృష్ణుడు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరినవారిలో నల్లా ఈశ్వరుడు, ఉగ్గిన శ్రీనివాస్, ఇనుకుర్తి శ్రీను, మైనవరపు సత్యనారాయణ, అప్పన రవి, ఇనుకుర్తి సురేష్, కరి బాబ్జిలతో పాటుగా 30 కుటుంబాలు ఉన్నాయి. ఈ సందర్భంగా కృష్ణుడు మాట్లాడుతూ కార్యకర్తలు సమష్టిగా కృషి చేసి తునిలో టీడీపీ జెండాను రెపరెపలాడించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షులు అప్పన రమేష్, వంగలపూడి బుజ్జి, వంగలపూడి శ్రీనివాస్, పోలిశెట్టి రామలింగేశ్వరరావు, చోడిశెట్టి శేషగిరి, కంకిపాటి రమణ, బోడ జమీలు, టీడీపీ నాయకులు ఉన్నారు.

టీడీపీ, జనసేనతోనే సుపరిపాలన

టీడీపీ, జనసేనతోనే సుపరిపాలన సాధ్యమని తుని టీడీపీ ఇన్‌చార్జి యనమల దివ్య అన్నారు. మీ ఇంటికి మీ దివ్య కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ యనమల కృష్ణుడుతో కలిసి ఎస్.అన్నవరం, నందివంపు గ్రామాల్లో ఇంటింటా ప్రచారం చేపట్టారు. ప్రజా సమస్యలు అడిగి తెలుసుకుంటూ పరిష్కారానికి హామీ ఇచ్చారు. జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు యనమల శివరామకృష్ణన్, పోల్నాటి శేషగిరిరావు, సుర్ల లోవరాజు, మోతుకూరి వెంకటేష్, చింతమనీడి నాగ సోమరాజు (అబ్బాయి), శ్రీనివాసరాజు, జక్కాన రామునాయుడు, ఆవుగంటి వెంకటరమణ, పోలిశెట్టి రామలింగేశ్వరరావు, పోలిశెట్టి అనీల్, వంగలపూడి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

‘వైసీపీకి వణుకు పుట్టింది’

కోటనందూరు, మార్చి 2: టీడీపీ, జనసేన కలయికతో వైసీపీకి వణుకు పుట్టిందని టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ యనమల కృష్ణుడు అన్నారు. కేఏ మల్లవరంలో జనసేన పార్టీ మండలాధ్యక్షుడు పేదపాత్ర శ్రీనివాస్ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయాన్ని కృష్ణుడు ప్రారంభించారు. త్వరలో టీడీపీ- జనసేన ప్రభుత్వం ఏర్పాటు చేయడం ఖాయమన్నారు. ఇప్పటికే వైసీపీ నేతలకు ఓటమి భయం పట్టుకుందన్నారు. తుని ఉమ్మడి అభ్యర్థి యనమల దివ్య విజయం కోసం కృషి చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జనసేన సమన్వయ కర్త చోటిశెట్టి గణేష్, పార్టీ మండల అధ్యక్షుడు గాడి రాజుబాబు, పెనుమంచి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధే టీడీపీ ధ్యేయం

ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప


ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే చినరాజప్ప

పెద్దాపురం, మార్చి 2: సంక్షేమ, అభివృద్ధే టీడీపీ ధ్యేయం అని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన వరహాయలయ్యపేటలో శనివారం ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా ఆయన ఆయా ప్రాంతాల్లో ఉన్న ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, జనసేన ప్రభుత్వం అధికారంలోకి వస్తుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు రాజాసూరిబాబురాజు, అరీఫ్ అలీ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పాలన అంతానికి సిద్ధం

మాజీ ఎమ్మెల్యే కొండబాబు


సమావేశంలో మాట్లాడుతున్న కొండబాబు

కాకినాడ సిటీ, మార్చి 2: వైసీపీ ప్రభుత్వ అవినీతి, అరాచక పాలనను అంతమొందించేందుకు అన్నివర్గాల ప్రజలు సిద్ధంగా ఉన్నారని మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు అన్నారు. టీడీపీ నిర్వహిస్తున్న శంఖారావం, సూపర్‌సిక్స్ భవిష్యత్తు గ్యారంటీ, తదితర అంశాలపై పార్టీ జిల్లా కార్యాలయంలో శనివారం కాకినాడ సిటీ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. కొండబాబు మాట్లాడుతూ ప్రశాంత నగరమైన కాకినాడను నేడు గుండాలు, రౌడీల నిలయగా మార్చి కాకినాడ ప్రతిష్ఠను ద్వారంపూడి దిగజార్చాడన్నారు. అక్రమ సంపాదన కోసం కాకినాడను డ్రగ్స్, గంజాయి నగరంగా మార్చి యువత భవిష్య త్తును నాశనం చేస్తున్నాడన్నారు. నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, తుమ్మల రమేష్, ఎన్.విశ్వనాథం, ఎస్‌కే రహీమ్, గదుల సాయిబాబు, బచ్చు శేఖర్, ఎంఏ తాజుద్దీన్, వొమ్మి బాలాజీ, దండుప్రోలు నాగబాబు, సీకోటి అప్పలకొండ, ఎండీ అన్సర్ పాల్గొన్నారు.

రేపు వరుపుల రాజా విగ్రహావిష్కరణ


ప్రత్తిపాడులో ఏర్పాటు చేసిన రాజా విగ్రహం

ప్రత్తిపాడు, మార్చి 2: ప్రత్తిపాడు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి వరుపుల సత్యప్రభ భర్త, దివంగత టీడీపీ నాయకుడు వరుపుల రాజా విగ్రహావిష్కరణకు విస్తృత ఏర్పాట్లు చేపట్టారు. ఈనెల 4న వరుపుల రాజా ప్రథమ వర్ధంతి పురస్కరించుకుని ఈ విగ్రహాన్ని ఆవిష్కరించేందుకు మాజీ మంత్రులు నిమ్మకాయల చినరాజప్ప, యనమల రామకృష్ణుడు తదితరులను శనివారం సత్యప్రభ ఆహ్వానించారు. స్థానిక హైస్కూల్ రోడ్డు జంక్షన్ వద్ద రాజా విగ్రహాన్ని ఆవిష్కరించేందుకు గత వారంరోజులుగా విస్తృత ఏర్పాట్లు చేపట్టారు. రాజా పది అడుగుల విగ్రహాన్ని కొత్తపేటకు చెందిన అంతర్జాతీయ శిల్పి రాజ్‌కుమార్ వడియార్ తయారు చేయడంతో ఆ విగ్రహాన్ని ఇప్పటికే ప్రత్తిపాడు తరలించారు. ఈ విగ్రహావిష్కరణకు విచ్చేసే రాజా అభిమానులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు 25వేల మందికి సత్యప్రభ ఆధ్వర్యంలో భోజన ఏర్పాట్లు కూడా చేపట్టారు. ఇందు కోసం పార్టీ కార్యాలయ పరిసరాల్లో షామియానాలు, టెంట్లు ఏర్పాట్లు చేపట్టారు.

భీమేశ్వరాలయంలో విశేష పూజలు

సామర్లకోట, మార్చి 2: సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయంలో శనివారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో బళ్ళ నీలకంఠం ఆధ్వర్యంలో వేదపండితులు సోమేశ్వరశర్మ, చెరుకూరి రాంబాబు, శ్రీనివాసరావు తదితరులతో భీమేశ్వరస్వామికి పంచద్రవ్యాలతో అభిషేకించారు. బాలాత్రిపురసుందరి అమ్మవారికి విశేష పుష్పార్చన పూజలు చేశారు. పూజల అనంతరం పెద్దఎత్తున ప్రసాదవితరణ జరిగింది. అధిక సంఖ్యలో హాజరైన భక్తులకు ఆలయ నిత్యాన్నదాన పథకంలో, భీమేశ్వర అన్నదానట్రస్ట్ ఆధ్వర్యంలో ఆలయ బయట ఆవరణలో వేర్వేరుగా అన్నదానాలు జరిగాయి.

‘డబ్బును పొదుపు చేయాలి’

ఏలేశ్వరం, మార్చి 2: ప్రతీ ఒక్కరూ డబ్బును పొదుపు చేయాలని, ఆ పొదుపును పెట్టుబడిగా మార్చగలిగితే దేశం అభివృద్ధి చెందుతుందని కాకినాడ పీఆర్ డిగ్రీ కళాశాల సీనియర్ అధ్యాపకులు జె.రంగారావు అన్నారు. ఏలేశ్వరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫైనాన్షియల్ లిటరసీ వీక్ సందర్భంగా శనివారం ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా రంగారావు మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ స్కిల్స్ క్రమశిక్షణ కలిగి ఉండాలన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ చిన్నారావు, రామారావు, బంగార్రాజు, మదీనా,శ్రీలక్ష్మీ ఉన్నారు.

దళితులకు తీరని అన్యాయం చేసిన వైసీపీ

టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వర్మ


అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్, ఎన్టీఆర్ చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న వర్మ

పిఠాపురం, మార్చి 2: రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దళితుల సంక్షేమాన్ని అటకెక్కించారని, వారికి సంబంధించిన 27 సంక్షేమ పథకాలను రద్దు చేసి తీరని అన్యాయం చేశారని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ అన్నారు. పిఠాపురం మున్సిపల్ కార్యాలయం సమీపంలోని పాత టీడీపీ కార్యాలయ ఆవరణలో శనివారం వర్మ ఆధ్వర్యంలో దళితగర్జన సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జగన్ పాలనలో దళితులపై దాడులు, హత్యాచారాలు పెరిగిపోయాయని విమర్శించారు. దళితుల ఓట్లతో అధికారంలోకి వచ్చిన జగన్ వారి పట్ల కక్షపూరితంగా వ్యవహరించి నిండా ముంచారని తెలిపారు. పేదలకు ఇళ్లస్థలాల విషయంలోనూ దళితులకు అన్యాయం జరిగిందన్నారు. దళితుల సంక్షేమానికి ఐదేళ్లల్లో ఒక్క రూపాయి వెచ్చించలేదని చెప్పారు. రానున్న ఎన్నికల్లో చంద్రబాబు ముఖ్యమంత్రిని, తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని ఆయన కోరారు. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల దళితులతో పాటు గొల్లప్రోలు, కొత్తపల్లి మాజీ జడ్పీటీసీలు మడికి ప్రసాద్, బత్తుల చైతన్యరాజేష్, నాయకులు నూతాటి ప్రకాష్, దుర్గాడ విజయలక్ష్మి, బోడపాటి పద్మ ఉన్నారు.

ఎన్నికల సిబ్బంది సమర్ధవంతంగా పనిచేయాలి

కాకినాడ కమిషనర్ వెంకటరావు


మాట్లాడుతున్న కమిషనర్ వెంకటరావు

కార్పొరేషన్ (కాకినాడ), మార్చి 2: ఎన్నికలను సజావుగా నిర్వహించడంలో వివిధ విభాగాల్లో నియామకమైన ఎన్నికల సిబ్బంది సమర్థవంతంగా పనిచేయాలని కాకినాడ సిటీ నియోజకవర్గ ఈఆర్వో, కార్పొరేషన్ కమిషనర్ జె.వెంకటరావు కోరారు. స్మార్ట్‌సిటీ కార్యాలయంలో శనివారం మోడల్ కోడ్‌ఆఫ్ కాండక్ట్, ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలు, స్టాటిస్టిక్స్ సర్వేలైన్స్, వీడియో సర్వేలైన్స్, పోలీస్ సెక్టార్ ఆఫీసర్లు, ఐటీ బృందాలకు ఎన్నికల విధులపై శిక్షణ ఇచ్చారు. డీఎస్పీ కె.హనుమంతరావు, డీఎల్‌డీవో ప్రసాదరావుతో పాటు సెక్టోరల్ అధికారులు, రూట్ ఆఫీసర్లు హాజరయ్యారు. ఎన్నికల నిర్వాహణకు సంబంధించి నియమితులైన సిబ్బందికి మాస్టర్ ట్రైనర్లు శిక్షణ నిర్వహించారు. ఎన్నికలు జరిగే రోజున, అంతకు ముందు చేపట్టాల్సిన విధులు, బాధ్యతలను వివరించారు. వెంకటరావు మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా విధినిర్వహణలో ఉండే సిబ్బంది మరింత అప్రమత్తంగా ఉండి పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. నగరపాలక సంస్థ కార్యదర్శి ఎం.ఏసుబాబు, డిప్యూటీ కమిషనర్ గుంటూరు శేఖర్, మేనేజర్ కర్రి సత్యనారాయణ, ఏఈ ఆర్వోలు హరిదాసు, నాగశాస్త్రులు, ఆర్వో డీటీ నాయుడు పాల్గొన్నారు. కమిషనర్ జె.వెంకటరావు కాకినాడ నగరంలోని వివిధ ప్రాంతాల్లో నిర్మాణం పూర్తి చేసుకున్న రహదారులు, డ్రైనేజీలు, సంజయ్‌నగర్‌లోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఆయన వెంట ఈఈ మాధవి, డీఈ సుబ్బారావు, ఏఈ వై.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

‘మహిళలు ఆర్థికంగా బలోపేతమయ్యేలా కృషి’


మహిళలు కుట్టిన చీరలు పరిశీలిస్తున్న పంతం

సర్పవరం జంక్షన్, మార్చి 2: రాబోయే టీడీపీ-జనసేన ఉమ్మడి ప్రభుత్వంలో మహిళలు ఆర్థికంగా మరింత బలోపేతం అయ్యేలా స్వయం ఉపాధి కల్పన, స్కిల్స్ డవెలప్‌మెంట్ కార్యక్రమాలు అమలు చేసేలా కృషి చేస్తానని కాకినాడ రూరల్ ఉమ్మడి అసెంబ్లీ అభ్యర్థి పంతం నానాజీ అన్నారు. శనివారం వలసపాకల గంగరాజునగర్‌లో నియోజకవర్గ జనసేన పార్టీ కార్యాలయంలో ఎస్సీఎస్టీ, బీసీ, మైనారిటీ సెల్ మహిళా నాయకురాలు ములపర్తి లతకుమారి ఆధ్వర్యంలో మహిళలు తయారు చేసిన పలు ఉత్పత్తుల మార్కెటింగ్ కిట్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల స్వయం ఉపాధి కోసం శిక్షణ ఇచ్చి దుస్తులు, వాషింగ్ మిషన్, క్యారీ బాగ్స్ తదితర వాటిపై శిక్షణ ఇచ్చి ప్రోత్సహించిన ములపర్తి లతకుమారిని అభినందించారు. మహిళలు తయారు చేసిన ఉత్పత్తులకు ప్రచారం చేసి మార్కెటింగ్ అవకాశాలు కల్పించేలా కృషి చేస్తామన్నారు. నియోజకవర్గం పరిధిలో జనసేన పార్టీ-తదేకం ఫౌండేషన్ ఆధ్వర్యంలో 1200 మంది మహిళలకు కుట్టు శిక్షణ ఇచ్చి, నిరుపేదలకు మిషన్లు అందించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వెలుగుబంట్ల సూరిబాబు, దాసరి శివ, పోసిన రాము, జీని శ్రీనివాస్, అద్దంకి వీరబాబు, వల్లూరి రాజు, హరిబాబు, దానయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు


కరప: వేళంగి పరీక్ష కేంద్రంలో విద్యార్థులు

కరప, మార్చి 2: వేళంగి ప్రభుత్వ జూనియర్ కళాశాల, జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటుచేసిన కేంద్రాల్లో శనివారం ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఈ రెండు కేంద్రాల్లో 419మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా తొలిరోజు పరీక్షకు 18మంది గైర్హాజరైనట్టు చీఫ్ సూపరింటెండెంట్ ఎం.శ్రీనివాసరావు, డిపార్టమెంటల్ ఆఫీసర్ వి.బాలకృష్ణలు తెలిపారు. వేళంగి పీహెచ్‌సీ వైద్యురాలు ఎంకే సౌజన్య నేతృత్వంలో వైద్యశిబిరం ఏర్పాటుచేశారు. ఎస్‌ఐ టి.రామకృష్ణ, ఏఎస్‌ఐ వి.సూరిబాబు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఏలేశ్వరం: పట్టణంలో సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో ఇంటర్‌మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మెదటి రోజు తెలుగు, సంస్కృతం పరీక్షలకు 565 మంది విద్యార్థులకు 16మంది గైర్హాజరయ్యారు. గురుకుల కళాశాలలో 275 మందికి 268 మంది, జూనియర్ కళాశాలలో 290 మందికి 281మంది హాజర య్యారని డిపార్ట్‌మెంట్ ఆఫీసన్లు ఎ.రామకృష్ణ, ఎ.ప్రతాప్, చీఫ్ సూపరిడెంట్లు బాబ్జి, జయలక్ష్మి తెలిపారు.

పిఠాపురం: పిఠాపురంలో ఇంటర్ సెకండియర్ పరీక్షలు శనివారం ప్రశాంతంగా జరిగాయి. ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన తెలుగు, సంస్కృతం పరీక్షలకు 292 మంది విద్యార్థులకు 276మంది హాజరుకాగా, సాంఘిక సంక్షేమశాఖ బాలికల గురుకుల పాఠశాలలో 186మందికి 185మంది, హనుమంతరాయ జూనియర్ కళాశాలలో 223మందికి 218మంది, అంజనా జూనియర్ కళాశాలలో 150 మందికి 145మంది విద్యార్థులు హాజరయ్యారు. నాలుగు కేంద్రాల్లో 27మంది గైర్హాజరయ్యారు. పరీక్షలు జరుగుతున్న తీరును పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ వి.కేశవరావు, డిపార్ట్‌మెంటల్ ఆఫీసరు వి.సుబ్రహ్మణ్యంలు పర్యవేక్షించారు.

జగ్గంపేట: ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు జగ్గంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రశాంతంగా జరిగాయి. 168 మంది పరీక్షలకు హాజరుకావల్సి ఉండగా 161 మంది హాజరయ్యారు. అలాగేఒకేషనల్ విద్యార్థులు 55 మంది హాజరుకావాల్సి ఉండగా 52 మంది హాజరయ్యారు.


ఏలేశ్వరంలో పరీక్ష రాసి వస్తున్న విద్యార్థులు

గొల్లప్రోలులో సప్తాహ మహోత్సవాలు ప్రారంభం

గొల్లప్రోలు, మార్చి 2: పట్టణంలో ఉమారామలింగేశ్వరస్వామి దేవాలయంలో ఉమారామలింగేశ్వర సాయిదుర్గా సప్తాహ మహోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. రేల సురేష్, లక్ష్మీదుర్గ దంపతులు కలశస్థాపన, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. 154గంటల పాటు నిరంతరాయంగా జరిగే ఈ భజన కార్యక్రమాల్లో 22 భక్త భజన సమాజాలు పాల్గొంటున్నాయి. 9వ తేదితో మహోత్సవాలు ముగియనున్నాయి.చివరిరోజున భారీ అన్నసమారాధన ఉంటుందని ఆలయ, సప్తాహ కమిటీల ప్రతినిధులు తెలిపారు.

‘ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు ప్రాధాన్యం’


పోలీసుస్టేషన్ భవనాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

పిఠాపురం, మార్చి 2: ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు ప్రాధాన్యమిస్తూ స్టేషన్‌కు వచ్చేవారితో మర్యాద పూర్వకంగా వ్యవహరించాలని మంత్రి దాడిశెట్టి రాజా, కాకినాడ ఎంపీ వంగా గీతావిశ్వనాథ్, పిఠాపురం ఎమ్మెల్యే పెండెం దొరబాబు సూచించారు. ఎస్ఆర్ఎంటీ సీఎస్ఆర్ నిధులు రూ.70లక్షలతో నిర్మించిన పిఠాపురం పట్టణ పోలీసుస్టేషన్ నూతన భవనాన్ని, అందులో విభాగాలను శనివారం వారు ప్రారంభించారు. నూతన భవనంలో ఎస్ఐ మురళీమోహన్ బాధ్యతలు చేపట్టారు. ఎంపీ మాట్లాడుతూ జిల్లాలో పిఠాపురం, కిర్లంపూడి, తిమ్మాపురం పోలీసుస్టేషన్లకు సీఎస్ఆర్ నిధులతో భవనాలు నిర్మించినట్లు తెలిపారు. ఏలూరు రేంజ్ డీఐజీ అశోక్‌కుమార్, జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్, డీఎస్పీ హనుమంతరావు, పిఠాపురం సీఐ శ్రీనివాస్, పలువురు ప్రజాప్రతినిధులున్నారు.

పల్స్‌పోలియోపై ర్యాలీలు

కరప, మార్చి 2: వేళంగిలో శనివారం వైద్యఆరోగ్యశాఖ సిబ్బంది ఆధ్వర్యంలో పల్స్‌పోలియో కార్యక్రమంపై అవగాహన ర్యాలీ జరిగింది. స్థానిక పీహెచ్‌సీ వైద్యురాలు ఎంకే సౌజన్య మాట్లాడుతూ ఆదివారం జరిగే పల్స్ పోలియో కార్యక్రమంలో ఐదేళ్ల లోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయించాలన్నారు. డాక్టర్ సింధూర, సిబ్బంది గోవిందబాబు, రమణారావు, సూర్యకుమారి, కృష్ణశేఖర్, విజయశ్రీ ఉన్నారు.

తొండంగి: ఆదివారం జరిగే పల్స్‌పోలియోను విజయవంతం చేయాలని కోరుతూ పెరుమాళ్ళపురం ఉన్నత పాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ప్రతి ఒక్కరూ తమ చిన్నారులకు పోలియో చుక్కలు వేయించడం ద్వారా వారి భవిష్యత్తును కాపాడవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సీహెచ్.సత్యన్నారాయణ తదితరులు ఉన్నారు.

34 పల్స్‌పోలియో శిబిరాలు

సామర్లకోట, మార్చి 2: పల్స్‌పోలియో కార్యక్రమంలో భాగంగా సామర్లకోటలో 34 పోలియో శిబిరాలు ఏర్పాటు చేసినట్టు అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారులు డాక్టర్ ప్రభ, డాక్టర్ సీహెచ్ భవ్యశ్రీ తెలిపారు. పట్టణ పరిధిలో 5 ఏళ్లలోపు ఉన్న చిన్నారులు 5424 మంది ఉన్నట్లు వైద్యఆరోగ్య సర్వే ద్వారా గుర్తించామన్నారు. ప్రతీ చిన్నారికి పోలియో చుక్కలు వేసేందుకు 34 పల్స్ పోలియో శిబిరాలు, ఆర్టీసీ కాంప్లెక్స్, రైల్వే స్టేషన్‌లలో 2 ట్రాన్సిట్ శిబిరాలను, రెండు సంచార శిబిరాలను ఏర్పాటు చేశామని తెలిపారు.

ఇళ్ల పట్టాల పంపిణీ

సర్పవరం జంక్షన్, మార్చి 2: నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు పథకంలో శనివారం నేమాం శివారు గుత్తులవారిపాలెంలో గ్రామ సర్పంచ్ రాందేవు చిన్న ఆధ్వర్యంలో సుమారు 200 మంది లబ్ధిదారులకు ఇళ్లపట్టాలను ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పంపిణీ చేశారు. ఎంపీపీ గోపిశెట్టి పద్మజబాబ్జీ, జడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ, వైస్ ఎంపీపీ బిందిరి వీరీష, పలువురు అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఉన్నారు.

విద్యార్థులకు స్కాలర్‌షిప్పులు

పెద్దాపురం, మార్చి 2: స్థానిక అళ్లక్కివారి సత్రం వద్ద దాత అళ్లక్కి వెంకట్రామయ్య ఆశయం మేరకు శనివారం 40 మంది విద్యార్థులకు రూ.5వేలు చొప్పున స్కాలర్‌షిప్పులను అందచేసినట్టు సత్రం ఈవో కాట్నం జగన్మోహన శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో సత్రం ధర్మకర్త అళ్లక్కి కృష్ణ, చర్ల రామారావు, రావులపర్తి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

బాధితుల కుటుంబానికి సాయం

ప్రత్తిపాడు, మార్చి 2: ఒమ్మంగిలో అగ్నిప్రమాద బాధితుల కుటుంబానికి సీమాంధ్ర బీసీ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ యల్లపు బులిరాజు ఆర్థిక సహాయం, బియ్యం పంపిణీ చేశారు. సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు మదినే నూకరాజు, ప్రధాన కార్యదర్శి ఒమ్మి గంగరాజు పాల్గొన్నారు.

రౌతులపూడి సర్వసభ్య సమావేశం

రౌతులపూడి, మార్చి 2: మండల అభివృద్ధికి అధికారులు సహకారంతో కృషి చేస్తానని ఎంపీపీ గంటిమళ్ల రాజ్యలక్ష్మి అన్నారు. ఆమె అధ్యక్షతన శనివారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో వ్యవసాయ, విద్యుత్, విద్య అంగన్‌వాడీ, వైద్య తదితర శాఖలపై సమీక్ష జరిపారు. మండల గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండలస్థాయి అధికారులున్నారు.

న్యాయ విజ్ఞాన సదస్సు

కరప, మార్చి 2: వేళంగి పంచాయతీ కార్యాలయంలో న్యాయవిజ్ఞాన సదస్సు జరిగింది. ప్యానల్ న్యాయవాదులు వై.వసంత, పేపకాయల గోపాలకృష్ణ పౌరహక్కులు, మహిళలకు సంబంధించిన వివిధ రకాల చట్టాలను వివరించారు. సర్పంచ్ నవిలే నీలిమారాజేష్, కార్యదర్శి పబ్బినీడి శ్రీనివాసరావు, వీఆర్వో భీమశంకరరావు, పారాలీగల్ వలంటీర్లు రామస్వామి, మల్లిఖార్జునరావు, అబ్దుల్ రహీమ్ ఉన్నారు.

దాట్ల బుచ్చిబాబు పరామర్శ

తాళ్లరేవు, మార్చి 2: ముమ్మిడివరం మాజీ ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు తాళ్లరేవు, కోరింగ, జి.వేమవరం, చొల్లంగి, చొల్లంగిపేటల్లో పలు బాధిత కుటుంబాలను పరామర్శించారు. దూళిపూడి వెంకటరమణ, టేకుమూడి లక్ష్మణరావు, మందాల గంగసూర్యనారాయణ, నడింపల్లి వినోద్, వీరబాబు ఉన్నారు.

సరోజినీ నాయుడికి నివాళి

సర్పవరం జంక్షన్, మార్చి 2: బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం జిల్లా కౌన్సిలర్ అడబాల రత్నప్రసాదరావు ఆధ్వర్యంలో శనివారం సరోజినీ నాయుడు వర్ధంతి పురస్కరించుకుని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సత్యనారాయణచౌదరి,చంద్రరావు తదితరులున్నారు.